క్లుప్తంగా

కంటైనర్ తొలగింపు

• సాక్షి ఎఫెక్ట్



కంటైనర్‌ను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్

నెల్లిమర్ల: మండల కేంద్రంలో చోటుచేసుకుంటున్న ఆక్రమణలపై సాక్షి దినపత్రికలో 'నెల్లిమర్లలో ఆక్రమణలు' శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ సుదర్శనరావు స్పందించారు. ఎంపీడీఓ కార్యాలయం రహదారిలో ఈవీఎం గొడౌన్ ఎదురుగా ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన కంటైనర్‌ను క్రేన్ సహాయంతో శనివారం తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ పి. వేణుగోపాలరావు, వీఆర్ఓ వెంకటరమణ, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి..

• ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విజయనగరం మండలం ద్వారపూడి ఎస్‌డబ్ల్యూపీ కేంద్రంలో శనివారం నిర్వహించిన ఘన వ్యర్థాల నిర్వహణ శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో పరిసరాల పరిశుభ్రత ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టి పంచాయతీలకు ఆదాయం చేకూర్చాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి టి. వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్‌డీ కన్నబాబు, మండల శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోవింద

పూసపాటిరేగ: బీఎల్ఓలు ఓటర్ల చేర్పులు, తొలిగింపులపై అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ తాడ్డి గోవింద అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల చేర్పులు – మార్పులు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉన్నప్పుడు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ వీవీఆర్ జగన్నాథరావు, ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బీపీఎం స్కూల్ పూర్వ విద్యార్థులు

విజయనగరం టౌన్: పట్టణంలోని బీపీఎం స్కూల్‌కి చెందిన 1967 – 72 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక శనివారం స్థానిక ఎస్‌వీఎన్ హోటల్‌లో సీనియర్ జర్నలిస్ట్ ఎలిశెట్టి సురేష్ కుమార్ నేతృత్వంలో జరిగింది. 50 ఏళ్ల కిందట తమతో చదివిన విద్యార్థులను చూసుకుని మురిసిపోయారు. ఎవరెవరు ఎక్కడ స్థిరపడ్డారు.. ఏమి చేస్తున్నారు.. కుటుంబ వివరాలు అడిగి తెలుసుకుని సందడిగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె.రామారావు, కాళిదాసు, పి.రామారావు, సుదర్శనరావు, పీఎస్.రావు, డాక్టర్ మాటూరు సతీష్, కృష్ణవేణి, డాక్టర్ పండు, తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

విజయనగరం: హెచ్ఐవీ పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) క్లబ్ జోన్ ప్రెసిడెంట్ సంతోష్‌కుమార్ సూచించారు.ఈ మేరకు శనివారం స్థానిక ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలో గల విజయ నెట్‌వర్క్ సెంటర్‌లో హెచ్ఐవీ బాధితులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హెచ్ఐవీ రోగుల పట్ల వివక్షత తగదని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, టూర్ కోఆర్డినేటర్ సాయిసుధీర్, జోన్ ఆఫీసర్ శ్రీనివాస్ సోను, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ప్రజిత్, విజయ నెట్‌వర్క్ ఫౌండర్ చౌదరి, జేసీఐ విజయనగరం మెట్రో అధ్యక్షులు గణపతిరాజు, అనితాదేవి, తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన ఆహార సలహా కమిటీలు..

• రేషన్‌షాపులపై కొరవడిన పర్యవేక్షణ
• సరుకుల పంపిణీలో మోసాలు

మండలం	రేషనుషాపుల సంఖ్య	కార్డుదారులు
పూసపాటిరేగ	47	24,009
భోగాపురం	32	18,344
డెంకాడ	42	17,067
నెల్లిమర్ల	42	24,220



పూసపాటిరేగ తహసీల్దార్ కార్యాలయం

పూసపాటిరేగ: రేషన్ షాపులలో అక్రమాలు జరగకుండా చూడడంతో పాటు నిరుపేదలకు సక్రమంగా రేషన్ అందేవిధంగా ఆహార సలహా సంఘ సభ్యులు పర్యవేక్షించేవారు. గతంలో ఎంతో బాధ్యతతో వ్యవహరించే ఆహార సలహా సంఘాలు నేడు కానరావడం లేదు. సంఘాల ఉనికి లేకపోవడంతో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో తూకాలలో మోసాలు జరుగుతున్నాయి. అలాగే లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి మూడు నెలలకోసారి మండల స్థాయిలో ఆహార సలహా కమిటీ సభ్యులు సమావేశమై మండల పరిధిలో ఉన్న రేషన్ షాపుల నిర్వహణపై సమీక్షించేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలో 163 రేషన్‌షాపులుండగా వాటి పరిధిలో గల పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాలలో 83,640 రేషనుకార్డులు ఉన్నాయి. ఆహార సలహా కమిటీ సంఘాలకు చైర్మన్‌గా మండల స్థాయిలో తహసీల్దార్.. జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వ్యవహరించేవారు. సభ్యులుగా ఎంపీడీఓ , జెడ్పీటీసీ సభ్యులు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులను నామినేట్ చేసేవారు. ప్రతి మూడు నెలలకోసారి సభ్యులు సమావేశమై ప్రజలకు సక్రమంగా రేషన్ అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించేవారు. అయితే నేటి పరిస్థితి చూస్తే అందుకు భిన్నంగా మారింది.

ఇష్టారాజ్యంగా..

ఆహార సలహా సంఘాలు లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతను పట్టించుకునే నాథులే కరువయ్యారు. రేషన్ షాపులలో తూకాలలో తేడాలు ఉంటున్నాయని పలువురు కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. రేషన్ సరుకులు సరఫరా చేసే వాహనాలను కొన్నిచోట్ల నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

లోపించిన పర్యవేక్షణ..

గతంలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించేవారు. రేషన్ సరుకుల పంపిణీపై పర్యవేక్షణ ఉండేది. రేషన్ షాపులలో వచ్చే లోటుపాట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పరిష్కారం చేసేవారు. ప్రస్తుతం కమిటీల ఉనికి లేకపోవడంతో నిత్యావసర సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది.

– ఎం. శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధి, పూసపాటిరేగ

పరామర్శ



ప్రణీత్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు

విజయనగరం: జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావును పలువురు మాజీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ, జనసేన నాయకులు శనివారం పరామర్శించారు. మజ్జి శ్రీనివాసరావు రెండో కుమారుడు ప్రణీత్‌బాబు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో పలువురు నాయకులు శ్రీనివాసరావు ఇంటికి శనివారం చేరుకుని ప్రణీత్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, శాసన మండలి సభ్యుడు పాలవలస విక్రాంత్, మాజీ మంత్రి పడాల అరుణ, శ్రీకాకుళం జెడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ, మాజీ శాసనసభ్యుడు గొర్లె కిరణ్, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, పేడాడ తిలక్, దువ్వాడ వాణి, తమ్మినేని నాగు, డోల జగన్, కోరాడ రాజబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, తదితరులున్నారు.

ఫారంపాండ్స్‌తో రైతులకు మేలు



ఫారంపాండ్ తవ్వకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: నీటి సమస్య తలెత్తకుండా రైతులకు మేలు చేకూర్చేందుకే ఫారంపాండ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు విజయనగరం ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక లక్ష 'ఫారంపాండ్స్'ను ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా మండలంలోని రీమాపేటలో ఫారంపాండ్ ఏర్పాటు కార్యక్రమానికి శనివారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 240 ఫారంపాండ్స్ తవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఒక్కో ఫారంపాండ్ ఏర్పాటుకు రూ. 60 వేలు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గొల్లలపేట ఎంపీటీసీ సభ్యుడు రమణ, ఎంపీడీఓ గంట వెంకటరావు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

జల సంరక్షణ చర్యలు చేపట్టాలి

• మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం టౌన్: ప్రతి ఒక్కరూ జల సంరక్షణ చర్యలు చేపట్టాలని, జలాన్ని వృథా చేయకుండా భావితరాలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య సూచించారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంఆర్ కళాశాల విద్యార్థులతో కళాశాల నుంచి మూడులాంతర్లు, గంటస్తంభం మీదుగా మహారాజా కళాశాల వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లనయ్య మాట్లాడుతూ.. నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. జిల్లా భూగర్భజల అధికారి ఎన్‌వీకే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో భూగర్భ జల మట్టాలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. ర్యాలీలో మహారాజా కళాశాల అధ్యాపక బృందం, సెట్విజ్, కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీ-4 సర్వేతో పేద కుటుంబాలు బలోపేతం



సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: ప్రవాసాంధ్రుల సహకారంతో రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే పీ -4 సర్వే ముఖ్య ఉద్దేశమని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని తెలిపారు. పట్టణంలోని 3, 4, 5 వార్డు సచివాలయాల్లో పీ – 4 కార్యక్రమంపై అభిప్రాయ సేకరణ నిమిత్తం శనివారం సభలు నిర్వహించారు. ఆయా సభల్లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. కేవలం దాతృత్వానికే పరిమితం కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలు తమ అమూల్యమైన అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బూర సుజాత, అప్పికొండ రవి కుమార్, రవ్వా నాని, బంగారు శంకరరావు, భానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

క్షయరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి

• డీఎంహెచ్ఓ జీవనరాణి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: విజయనగరాన్ని క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని డీఎంహెచ్ఓ జీవనరాణి తెలిపారు. శనివారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... క్షయవ్యాధిని అంతం చేయాలన్న నినాదంతో ఈనెల 24న ప్రపంచ క్షయవ్యాధి నివారణా దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా క్షయవ్యాధిపై అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 2025 నాటికి క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాను 10 యూనిట్లుగా విభజించి వ్యాధి నిర్మూలనకు చర్యలు చేపట్టామన్నారు. క్షయ వ్యాధి అంటువ్యాధి ని, లక్షణాలు ఉన్న వారు కఫం పరీక్ష చేసుకోవాలని సూచించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, కఫంలో రక్తపు జీరలు, రాత్రి పూట చెమట పట్టడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది , ఆలసటగా ఉండటం, మెడవద్ద వాపు, తదితర లక్షణాలుంటే క్షయ పరీక్షలు చేయించుకోవాలన్నారు. 2024 డిసెంబర్ 7న ప్రారంభించిన వంద రోజుల టీబీ కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 100 రోజుల టీబీ కార్యక్రమంలో 861 క్షయ కేసులను గుర్తించామన్నారు. సమావేశంలో జిల్లా క్షయ నివారణ అధికారి కె. రాణి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

రూ. 96.73 లక్షలతో వేసవి ప్రణాళికలు

• రూ. 1.80 కోట్లతో కమిషనర్ బంగ్లా నిర్మాణం
• తాత్కాలిక ప్రాతిపదికన పారిశుధ్య కార్మికుల నియామకాలు
• కార్పొరేషన్ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్



నగర పాలక సంస్థ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు.. నగరంలో పారిశుధ్య నిర్వహణకు అవసరమయ్యే సిబ్బంది నియామకాలు.. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం.. తదితర అంశాలను విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగిన సాధారణ సమావేశంలో మొత్తం 40 అంశాలతో కూడిన రెండు అజెండాలను ప్రవేశపెట్టగా... అందులో రెండు అంశాలు మినహా మిగిలిన అంశాలకు కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. సమావేశంలో ముందుగా ఇటీవల మృతి చెందిన 34వ డివిజన్ కార్పొరేటర్ బాలి పైడిరాజు, మాజీ కౌన్సిలర్ మేకా కాశీవిశ్వేశ్వరుడుల అకాల మృతికి సంతాపంగా సభ్యులంతా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఫ్లోర్‌లీడర్ శెట్టివీరవెంకట రాజేష్, కోఆప్షన్ సభ్యుడు ఆశపు వేణు మాట్లాడుతూ.. దివంగత సభ్యుల సేవలను కొనియాడారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రధానంగా ప్రస్తుత వేసవిలో నగర ప్రజలకు అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా చేసేందుకు రూ.96.73 లక్షలతో నిధులు మంజూరు చేశారు. అదేవిధంగా కమిషనర్ బంగ్లా నిర్మాణానికి రూ.1.80 కోట్లు కేటాయించారు. నగరంలోని 50 డివిజన్‌లలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో నూతనంగా 45 మంది కార్మికులను తాత్కాలిక ప్రాతిపదికన నియమించేందుకు కౌన్సిల్ అమెదం తెలిపింది. సమావేశాన్ని ఉద్దేశించి మేయర విజయలక్ష్మి మాట్లాడుతూ.. అందరి సహకారంతో నగర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేష్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలపై దృష్టి సారించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో పలువురు సిబ్బంది జీతాలు తీసుకుంటున్నప్పటికీ వారి స్థానంలో వేరొకరితో పనులు చేయించడంపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ.. తాగునీటి ఎద్దడి నివారణ చేపడుతున్న చర్యలు శతశాతం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. కో ఆప్షన్ సభ్యుడు ఆశపు వేణు మాట్లాడుతూ.. కౌన్సిల్ ఏర్పడిన నాలుగు సంవత్సరాల కాలంలో నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. ప్రభుత్వం జారీ చేసిన భవన నిర్మాణాల నిబంధనల వివరాలను అసిస్టెంట్ సిటీప్లానర్ హరిబాబు సభ్యులకు వివరించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, కమిషనర్ పల్లి నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ కె అప్పలరాజు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ..



విజయనగరం పట్టణంలోని కణపాకలో 50 మంది పేదలకు మారుతీ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో బియ్యం, గోధమనూక వంటి నిత్యావసర వస్తువులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్త చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ.. పేదలకు పట్టెడన్నం పెట్టడంలో సంతృప్తి ఉందన్నారు. 15 ఏళ్లుగా మారుతీ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్, అరసాడ అప్పలస్వామి, బి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం ఫోర్ట్

సీసీ కెమెరాల ఏర్పాటు..



డెంకాడ మండలంలోని జాతీయ రహదారులపై సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని విజయనగరం – విశాఖ జాతీయ రహదారి, మోదవలస – శ్రీకాకుళం జాతీయ రహదారుల్లోని పలు ప్రధాన ప్రాంతాల్లో శనివారం కెమెరాలు ఏర్పాట్లు చేశామన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో నిందితులను పట్టుకోవడానికి కెమెరాలు ఉపయోగపడతాయని చెప్పారు. – డెంకాడ

విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలి



అదానీతో కుదిరిన సెకీ ఒప్పందం రద్దు చేయడంతో పాటు ట్రూఅప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని 29వ డివిజన్ రామకృష్ణనగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అలాగే 33వ వార్డు ముచ్చు వాణి చెరువు గట్టుపై విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. అధికారంలోకి రాకముందు కూటమి పెద్దలు బాదుడే బాదుడు అనే పేరుతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారాని, తీరా అధికారంలోకి వచ్చాక విద్యుత్ బిల్లులను ఎడాపెడా పెంచేస్తున్నారని ఆరోపించారు. కేవలం విద్యుత్ రంగంలోనే 17 వేల కోట్ల రూపాయల భారం ప్రజలపై వేయడం తగదన్నారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు వి.లక్ష్మి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం గంటస్తంభం

సీతంలో ప్రపంచ జల దినోత్సవం



ప్రతిజ్ఞ చేయిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, తదితరులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని గాజులరేగ పరిధి సీతం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం అంతర్జాతీయ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో 'హిమనీ నదాల సంరక్షణ – స్థిరమైన జల భవిష్యత్' పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం డిప్యూటీ ఈఈ యడ్ల గోవిందరావు మాట్లాడుతూ.. తాజా నీటి వనరుల్లో హిమనీ నదాలు కీలక భూమిక వహిస్తున్నాయన్నారు. వాటి పరిరక్షణ కోసం సామూహికంగా కృషి చేయడం అత్యవసరమని అభిప్రాయపడ్డారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల కోసం నీటి సంరక్షణ అత్యంత అవసరమన్నారు. అనంతరం ముఖ్య అతిథి ఆధ్వర్యంలో నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ రవికిశోర్, అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

నేడు 'ఉల్లాస్' పరీక్ష



డెంకాడ: సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం వి.శ్రీనివాస్



నెల్లిమర్ల: సిబ్బందికి మెటీరియల్ అందజేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

డెంకాడ: మండలంలోని 39 ప్రాథమిక, నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో ఉల్లాస్ అసెస్‌మెంట్ పరీక్ష ఆదివారం నిర్వహించనున్నట్లు వెలుగు ఏపీఎం వి.శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో పరీక్షకు సంబంధించిన విధివిధానాలపై ఇన్విజిలేటర్లు, వాల్యూయేటర్లగా విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యాసకులు పరీక్ష కేంద్రాలకు సమయానికి చేరుకునేలా అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఓఏలు, ఆశ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

అందరూ హాజరయ్యేలా చూడాలి

నెల్లిమర్ల: వయోజన విద్యకు సంబంధించిన ఉల్లాస్ పరీక్ష పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ రామకృష్ణరాజు సూచించారు. ఈ మేరకు పరీక్ష మెటీరియల్‌ను సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 32 కేంద్రాల్లో 1830 మంది అభ్యాసకులు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యాసకులందరూ హాజరయ్యేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓలు సురేష్, పద్మ పాల్గొన్నారు.

ఆశీల వేలం పాట వాయిదా

నెల్లిమర్ల: నగర పంచాయతీలో 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆశీలు వసూలు చేసుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలంపాట వాయిదా వేసినట్లు కమిషనర్ అప్పలరాజు తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం బహిరంగ వేలం నిర్వహించగా ఒక్కరూ హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు చెప్పారు. ఈ నెల 24న మధ్యాహ్నం 3.30 గంటలకు వేలం పాట నిర్వహిస్తామన్నారు.